గురువులకే గురువు డాక్టర్ సర్వేపల్లి

ఏప్రిల్ 17 సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి

డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత దేశపు మొట్టమొదటి ఉప రాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి. భారతీయ తాత్విక చింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టారని పేరెన్నిక గన్న మహా మహోపాధ్యాయుడు. రెండు పర్యాయాలు ఉప రాష్ట్రపతి పదవి చేపట్టి, తరువాత రాష్ట్రపతిగా ఒక పర్యాయం పదవిని చేపట్టి, భారత దేశపు అత్యంత క్లిష్టకాలంలో (చైనా, పాకిస్తాన్లతో యుద్ధ సమయం) నాటి ప్రధానులకు మార్గ నిర్దేశంచేశారు. మహామేధావిగా, గొప్పవ్యక్తిగా, గొప్ప గ్రంథకర్తగా, తత్వవేత్తగా, ప్రపంచ దేశాల మన్ననను అందుకున్న రాధాకృష్ణన్ భార తీయ మహర్షుల కోవకు చెందిన వారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబర్ 5- 1888న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీల దూరమున ఉన్న తిరుత్తణిలో తమిళ నాడుకు వలస వెళ్లిన తెలుగు దంపతులు అయిన సర్వేపల్లి వీరస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించారు. వీరా స్వామి ఒక జమీందారీలో తహసిల్దార్.వారి మాతృభాష తెలుగు.సర్వేపల్లి బాల్యము, విద్యా భ్యాసము ఎక్కువగా తిరుత్తణి, తిరుపతిలోనే గడిచి పోయాయి. ప్రాథమిక విద్య తిరుత్తణిలో సాగింది. తిరుపతి, నెల్లూరు, మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మున్నగు చోట్ల చదివి ఎం.ఏ పట్టా పొందారు. బాల్యం నుండి అసాధారణమైన తెలివి తేటలు కలవారాయన. 21 సంవత్సరాలైనా దాటని వయసులో ఆయన మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసర్ అయ్యారు. తత్వశాస్త్రంలో ఆయన ప్రతిబను తెలుసుకుని, మైసూరు విశ్వ విద్యాలయం ఉపకులపతి హెచ్.వి.నంజుండయ్య ఆయనను పిలిపించిప్రొఫెసర్గా నియమించారు. ఆయన ఉపన్యాసాలను ఎంతో శ్రద్ధగా వినేవారు విద్యార్థులు. కలకత్తా విశ్వ విద్యాలయంలో ఆచార్య పదవి చేపట్టమని, డా. అశుతోష్ ముఖర్జీ, రవీంద్రనాథటాగూర్లుకోరారు.దాంతో అతను కలకత్తా వెళ్ళారు. కలకత్తా విశ్వ విద్యాలయంలో ఆచార్యుడుగా వున్నప్పుడు అతను 'భారతీయ తత్వశాస్త్రం' అన్న గ్రంథం వ్రాశారు. ఆ గ్రంథం విదేశీ పండితుల ప్రశంస లందుకున్నది. 1931లో డా. సి.ఆర్.రెడ్డి గారి తర్వాత రాధాకృష్ణన్ ఆంధ్ర విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సిలర్గా పనిచేశారు. అప్పట్లో డా. రాధా కృష్ణన్ పిలుపును అనుసరించి ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ, హుమయూన్ కబీర్ వంటి మేధావులు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్లుగా పనిచేశారు. 1931లోనే రాధా కృష్ణన్ "లీగ్ ఆఫ్ నేషన్స్ 'ఇంటలెక్చ్యుయల్ కో-ఆపరేషన్ కమిటీ'" సభ్యులుగా ఎన్నుకోబడినారు. 1936లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రాచ్యమతాలగౌరవఅధ్యాపకునిగా అయినారు. చైనా,అమెరికాదేశాల్లో పర్యటించి పెక్కు ప్రసంగాలు చేశారు. 1946లో ఏర్పడిన భారత రాజ్యాంగ పరిషత్ సభ్యులు అయినారు. 1947 ఆగస్టు 14-15తేదీన మధ్య రాత్రి 'స్వాతంత్ర్యోదయం' సందర్భాన రాధాకృష్ణన్ చేసిన ప్రసంగం సభ్యులను ఎంతో ఉత్తేజ పరిచింది.1949లో భారత దేశంలో ఉన్నత విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టాలి అన్న లక్ష్యంతో ప్రభుత్వం ఒక కమిటి నియమించింది. దానికి అధ్యక్షుడు డా. రాధాకృష్ణననే. డా.రాధాకృష్ణన్, ప్రధాని నెహ్రూ కోరిక మేరకు 1952-62 వరకు భారత ఉప రాష్ట్రపతిగా పనిచేశారు.రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయనశిష్యులు, అభిమానులు పుట్టిన రోజును ఘనంగా చేస్తామని కోరగా, దానికి బదులు ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా చేయాలని అతను కోరారట. ఆరోజు నుంచే ఆయన పుట్టినరోజును "ఉపాధ్యాయ దినోత్సవం"గా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. రాధా కృష్ణన్ ది చాలాపేద కుటుంబం. ఉన్నత విద్య చదివించే స్తోమత లేదని తండ్రి వీరా స్వామికొడుకును పూజారివృత్తి చేయ మన్నారు .కానీరాధాకృష్ణన్‌కుచదువంటే ప్రాణం. అందుకే ఉన్నత పాఠశాల చదువుకోసం తిరుపతి లోని మిషనరీ పాఠశాలలో చేరారు. ఇక అప్పటినుంచీ చదువంతా ఉపకార వేతనాల తోనే సాగి పోయింది. భోజనం చేసేందుకు అరిటాకు కూడా కొనలేని పరిస్థితుల్లో అతను నేలను శుభ్ర పరచుకొని భోజనం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.రాష్ట్రపతిగా ఉన్నప్పుడు వచ్చే వేతనంలో కేవలం 25 శాతం తీసుకుని మిగతాది ప్రధాన మంత్రి సహాయ నిధికి తిరిగి యిచ్చేవారు.ఆయన దృష్టిలో తత్వము అనేది జీవితాన్ని అర్థం చేసు కోవటానికి ఒక మార్గము, భారతీయ తత్వమును అర్థం చేసు కోవటం అనేది ఒక సాంస్కృతిక చికిత్సగా భావించేవారు. భారతీయ ఆలోచనా దృక్పధాన్ని పాశ్చాత్య పరిభాషలో చెప్పి, అందులో వివేకము, తర్కము ఇమిడి ఉన్నాయని చూపించి, భారతీయ తాత్విక చింతన ఏమాత్రం తక్కువ కాదని నిరూపించారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళా శాలలో తాత్విక శాస్త్ర ఉపన్యాసకుడిగా, ఉప ప్రాధ్యాపకుడిగా, ప్రాధ్యాపకుడిగా వివిధ పదవులను అలంక రించారు. 1918 నుండి 1921 వరకు మైసూరు విశ్వ విద్యాలయంలో తత్వశాస్త్ర ప్రాధ్యాపకుడిగా (ప్రొఫెసర్) పని చేసారు. 1921లో, అప్పటి భారతదేశం లోని కలకత్తా విశ్వ విద్యాలయంలో ముఖ్య తాత్విక పీఠమైన, కింగ్ జార్జ్ 5 చెయిర్ ఆఫ్ మెంటల్ అండ్ మోరల్ సైన్స్ కు రాధాకృష్ణన్‌ను నియమించారు. 1926 జూన్‌లో బ్రిటనులో జరిగిన విశ్వ విద్యాలయాల కాంగ్రెసులో కలకత్తా విశ్వ విద్యాలయానికి ప్రాతినిధ్యం వహించారు. తరువాత ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డు విశ్వ విద్యా లయం నిర్వహించే అంతర్జాతీయ తాత్విక కాంగ్రెస్ లో సెప్టెంబర్ 1926లో కూడా కలకత్తా విశ్వ విద్యాలయానికి ప్రాతినిధ్యం వహించారు. 1931 నుండి 1936 వరకు ఆంధ్ర విశ్వ విద్యాలయానికి ఉపకులపతి (వైస్ ఛాన్సలర్)గా పని చేసారు. 1936లో, స్పాల్డింగ్ ప్రొఫెసర్ ఆఫ్ ఈస్టర్న్ రిలీజియన్స్ అండ్ ఎథిక్స్ అనే పీఠంలో ఆక్స్‌ఫర్డు విశ్వ విద్యాలయంలో 1952లో భారతదేశ ఉప రాష్ట్రపతి పదవిని అలంకరించే వరకు కొన సాగారు. 1939 నుండి 1948 వరకు బెనారస్ హిందూ విశ్వ విద్యాలయానికి ఉపకులపతి(వైస్ ఛాన్సలర్)గా, 1949 నుండి 1952 వరకు రష్యాలో భారత రాయబారిగా పని చేసారు. 1946 నుండి 1950 వరకు పలుమార్లు భారతదేశం తరుపున యునెస్కో సభ్య బృందానికి అధ్యక్షత వహించారు. 1948 లో విశ్వ విద్యాలయాల విద్యా కమిషనుకు అధ్యక్షుడిగా భారత ప్రభుత్వంచే నియమింపబడ్డారు.1948లో యునెస్కో కార్యనిర్వాహక బృందానికి అధ్యక్షుడిగా ఉన్నారు.1952లో యునెస్కో అధ్యక్షునిగా ఎంపిక అయ్యాడు. 1962లో బ్రిటీషు ఎకాడమీకి గౌరవ సభ్యునిగా ఎన్నుకో బడ్డారు. 1931లో బ్రిటీషు ప్రభుత్వం వారు ఇచ్చే ప్రతిష్ఠాత్మక "సర్" బిరుదు ఆయనను వరించింది.1954లో మానవ సమాజానికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా భారత దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన "భారతరత్న" బిరుదు పొందారు. 1961లో జర్మనీ పుస్తక సదస్సు యొక్క శాంతి బహుమానం పొందారు. 1963 జూన్ 12న బకింగ్ హామ్ ప్యాలెస్ లోని ఆర్డర్ ఆఫ్ మెరిట్‌కి గౌరవసభ్యునిగాఎన్నుకోబడ్డారు.ప్రపంచ ప్రఖ్యాత విశ్వ విద్యాలయాలయిన ఆక్స్‌ఫర్డు, కేంబ్రిడ్జి, మొదలయిన వాటినుండి వందకు పైగా గౌరవ పురస్కారాలు, డాక్టరేటులు సంపాదించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

వైశాఖ మాసం వైశిష్ట్యం

"" ఈ చరాచర సృష్టిలో తల్లి తన పిల్లల కోరికలన్నింటినీ తీర్చినట్లే, వైశాఖ మాసం మానవుల కోరికలన్నింటినీ తీరుస్తుంది కాబట్టి అది అపారమైన ప్రాముఖ్యతను కలిగి ఉందని నారద మహర్షి బ్రహ్మ నుండి ధృవీకరించారు. ఈ మాసం విష్ణువుకు చాలా ప్రియమైనది, అర్హులైన వారికి అనేక వరాలను ప్రసాదిస్తుంది. ఈ మాసం ధర్మం, యజ్ఞం, క్రియ మరియు తపస్సులకు సారాంశం. వైశాఖ మాసం ధర్మ సాధక మాసం. ఎలాగైతే వేద విద్య విద్యలలోకెల్లా శ్రేష్ఠమైనదో, ప్రణవం మంత్రాలలోకెల్లా శ్రేష్ఠమైనదో, కల్పవృక్షం వృక్షాలలోకెల్లా సర్వోన్నతమైనదో, సూర్యదేవుడు తేజస్సులలో కెల్లా శ్రేష్ఠమైనదో, సుదర్శన చక్రం శాస్త్ర అస్త్రాలలోకెల్లా అత్యంత శక్తివంతమైనదో, బంగారం లోహాలలోకెల్లా శ్రేష్ఠమైనదో, శివుడు వైష్ణవులలో విశిష్టమైనదో, కౌస్తుభం రత్నాలలోకెల్లా శ్రేష్ఠమైనదో, అలాగే ఇది కూడా ధర్మ సాధక మాసం. సూర్యోదయానికి ముందే స్నానం చేసే వారిని నారాయణుడు ఎంతగానో గౌరవిస్తాడు. వైశాఖ మాసం లాగే, సత్యయుగం లేదు, జల దానం వంటి దానం లేదు, వ్యవసాయ సంపద లేదు, ఉపవాసం వంటి తపస్సు లేదు, దాన ధర్మాల వంటి సుఖం లేదు, కరుణ, క్షమ వంటి పుణ్యం లేదు, మంచి ఆరోగ్యం వంటి శ్రేష్ఠత లేదు, అన్నింటికంటే ముఖ్యంగా విష్ణువు వంటి భగవానుడు లేడని శాస్త్ర వచనం. అందుకే ఇది మాధవ మాసంగా పిలువబడుతుంది.""

వైశాఖం నామ ఔచిత్యం

వైశాఖ మాసాన్ని మాధవ మాసమని కూడా పిలుస్తారు. పౌర్ణమి రోజున చంద్రుడు విశాఖ నక్షత్రంతో కూడి ఉండడం వల్ల దీనికి వైశాఖ మాసం అనే పేరు వచ్చింది. సనాతన హైందవ సంప్రదాయంలో శ్రీ మహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన, పవిత్రమైన మాసం ఇది. ఈ మాసంలో సూర్యోదయానికి ముందు స్నానం (వైశాఖ స్నానం), దానధర్మాలు, తులసిదళ పూజ అత్యంత ఫలప్రదం. అక్షయ తృతీయ, నరసింహ జయంతి,బుద్ధ పౌర్ణమి వంటి ముఖ్యమైన పర్వదినాలు ఈ మాసంలోనే వస్తాయి, ఇవి అక్షయమైన (తరిగిపోని) పుణ్యాన్ని ప్రసాదిస్తాయని పురాణాలు వివరిస్తున్నాయి.

వైశాఖంలో వచ్చే పర్వదినాలు

వైశాక శుద్ధ పాడ్యమి వైశాఖ పవిత్ర స్నాన వ్రతంతో వైశాఖం శుభారంభం. తదియ అక్షయ తృతీయ. బలరామ జయంతి. ప్రముఖ వైష్ణవక్షేత్రమైన సింహాచల క్షేత్రంలో సింహాచల నరసింహస్వామి వారి నిజరూప సందర్శనం మరియు దివ్య చందనోత్సవం. పంచమి జగద్గురు ఆది శంకరుల జయంతి మరియు శ్రీమ ద్రామానుజాచార్యుల జయంతి. సప్తమి గంగాసప్తమి.అష్టమి దేవి పూజ. నవమి ద్వాపర యుగాంతం జరిగి కలియుగారంభం. వృషభ సంక్రమణ పుణ్యకాలం. దశమి శ్రీ పోతులూరి బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలు ఆరంభం. ఏకాదశి మోహిని ఏకాదశి. ప్రముఖ క్షేత్రం అన్నవరంలో శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారి కళ్యాణం ఉత్సవం ప్రారంభం. ద్వాదశిశ్రీ పరుశురామజయంతి.వైశాక పూర్ణిమ మహా వైశాఖి ఉత్సవం. భగవాన్ బుద్ధదేవుని జయంతి ఉత్సవం. వైశాఖ బహుళ పాడ్యమి భూతమాతృత్సవం. విధియ నారద జయంతి. నవమి, దశమి శ్రీ దత్తాత్రేయ స్వామి వారి జయంతి ఉత్సవాలు. ఏకాదశి అపర ఏకాదశి. బహుళ చతుర్దశి సావిత్రి వ్రతం. మాస శివరాత్రి. అమావాస్య వృషభ సంక్రమణం తో వైశాఖమాసం సంపన్నమవుతుంది.

వైశాఖంలో 'స్నానాలు' చేస్తున్నప్పుడు, మధుసూదనుడిని స్తుతిస్తూ శ్రద్ధాసక్తులతో ఈ క్రింది శ్లోకం పఠించాలి.

మధుసూదన దేవేశ;
వైశాఖే మేషగే రవై?
ప్రాతఃస్నానం కరిష్యామి;
నిర్విఘ్నం కురు మాధవ॥

(ఓ మధుసూదన! దేవేశ్వర మాధవా! మేష రాశిలో సూర్యదేవుడు కొలువై ఉన్నప్పుడు నేను తెల్లవారుజామున వైశాఖ మాస స్నానమాచరిస్తున్నాను; దయతో నా స్నానాన్ని ఆటంకం లేకుండా నెరవేర్చి నన్ను అనుగ్రహించు.)

స్నానం చేసిన తరువాత, సూర్యుడిని చూస్తూ 'అర్ఘ్యం' (దోసిలి నిండా నీరు) సమర్పిస్తూ ఈ శ్లోకాన్ని భక్తితో పఠించాలి.

వైశాఖే మేషగే భానౌ;
ప్రాతః స్నాన పరాయణ?
అర్ఘ్యం తేహం ప్రదాస్యామి;
గృహాణ మధుసూదన॥

(ఓ మధుసూదనా! వైశాఖ మాసంలో సూర్యుడు మేష రాశిలో ఉన్నప్పుడు, తెల్లవారుజామున నేను లాంఛనంగా 'అర్ఘ్యం' సమర్పిస్తున్నాను; దయచేసి స్వీకరించు.)

వైశాఖంలో చేయవలసిన దానాలు, ఫలితాలు

వైశాఖంలో జలదానం ఎంతో పుణ్యాన్ని ఇస్తుంది. అన్ని దానాల వల్ల కలిగే పుణ్యఫలం ఒక్క జలదానం వలన వస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే ప్రతి చోటా చలివేంద్రాలు పెట్టి దాహం తీర్చే ఆచారం మనకు అనాదిగా వస్తుంది. ఈ చలివేంద్రాలు పితృదేవతలకు దేవతలకు మనుషులకు అందరికీ ఇష్టమైనది. బ్రహ్మ విష్ణు మహేశ్వరులను తృప్తి పరుస్తుంది. పూర్వీకులు అంతా పుణ్యలోకాన్ని పొందుతారు. నీటిని దక్షిణతో సహా బ్రాహ్మణునికి దానం చేస్తే ధన ప్రాప్తి కలుగుతుందని స్కాంద పురాణం తెలియజేస్తుంది. ఈ కాలంలో లభించే మామిడ పండ్ల దానం వలన పితృదేవతలు సంతోషిస్తారని, వారికి పుణ్యాలోక ప్రాప్తి కలుగుతుందని నమ్మకం. పానకం నిండిన కుండను దానం వలన మూడుసార్లు గయా శ్రాద్ధం చేసిన ఫలితం కలిగి తద్వారా పితృదేవతలు తరిస్తారని విశ్వాసం. దోస పండు, బెల్లం, చెరుకు గడలు దానం వలన వారి సమస్త పాపాలు తొలగుతాయి. శయన దానం వలన సుఖసంతోషాభివృద్ధి. వస్త్రదానం వల్ల ఆయుర్వృద్ధి. ముఖ్యంగా తెల్లని వస్త్రాన్ని దానం ఇస్తే పూర్ణాయువు పొంది ముక్తిని పొందుతారని నమ్మకం. పేదవారికి బట్టలు ఇచ్చినట్లయితే రోగబాధల నుండి విముక్తి కలుగుతుంది. భర్తకి దీర్ఘాయువు కలుగుతుంది. ఇది మహిళలకు చెందినటువంటి దాన ప్రక్రియ. చందన దానం వలన తరచుగా జరిగే రోడ్డు ప్రమాదాల నుండి రక్షించబడతారని నమ్మకం. తాంబూల దానం వలన ఆధిపత్యం సిద్ధిస్తుందని శాస్త్ర వచనం. ఏడు తరాల పితృదేవతలు నడక బాధలను విముక్తి పొందుతారని నమ్మకం. మజ్జిగ దానం వలన విద్యా ప్రాప్తి కలుగుతుంది. పాదరక్షలు దానంతో బాధల నుండి విముక్తి లభిస్తుంది. గొడుగు దానం వలన కష్టాలను విముక్తి లభిస్తుంది. వారికి మృత్యువాత ఉండదని చెప్పబడింది. సమ స్త దోషాలు నివారణ అవుతాయి. పండ్ల దానం వలన జీవితంలో ఉన్నత స్థాయికి చేరి తలచిన పనులన్నీ ఫలవంతం అవుతాయని నమ్మకం. బియ్యం దానం వలన అపమృత్యు దోషా లు తొలగుతాయి. అన్ని యజ్ఞాలు చేస్తే వచ్చే పుణ్యఫలం బియ్యం దానం వలన లభిస్తుంది. ఆవు నెయ్యి దానం వలన అక్షయ యాగం చేసిన పుణ్య లభిస్తుంది. పితృదేవతలకు తర్పణాలు వదిలే వారికి దారిద్ర్య బాధలు ఉండవు. ఈ మాసంలో అన్నదానం విశేష ఫలితాన్ని ఇస్తుంది. వెంటనే తృప్తినిచ్చే దానాలన్నింటిలోకెల్లా ఉత్తమమైన దానం అన్నదానం సమస్తదేవతల యొక్క ఆశిస్సులు లభిస్తాయి. అన్ని ధర్మాలను ఆచరించిన ఫలితం లభిస్తుంది. పెరుగన్నం దానం చేయడం వలన వారు చేసిన తెలిసో తెలియక చేసిన పాపాలను తొలిగి పుణ్యం ప్రాప్తిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇలా వైశాఖంలో నియమాలు పాటించాలి. ముక్తి పథంలో పయనించాలి. శుభమస్తు!

చౌడూరి నరసింహారావు
ప్రవచన కర్త, ఆధ్యాత్మిక విశ్లేషకులు

గంగా తీరంలో రాజకీయ తరంగాలు

నిరంతర పోరాటాల రాష్ట్రం: పశ్చిమ బెంగాల్ రాజకీయ వైవిధ్యం

దీదీ వర్సెస్ మోడీ: బెంగాల్ అస్తిత్వానికి, జాతీయ వాదానికి మధ్య సాగుతున్న సమరం

?భారత రాజకీయ పటంలో పశ్చిమ బెంగాల్ ఒక విలక్షణమైన రాష్ట్రం. ఇక్కడి రాజకీయం కేవలం అధికార మార్పిడికి సంబంధించింది కాదు; అది సంస్కృతి, సిద్ధాంతం మరియు పోరాట పటిమల కలయిక. దేశంలోని ఇతర రాష్ట్రాలలో కుల రాజకీయాలు రాజ్యమేలుతుంటే, బెంగాల్‌లో మాత్రం దశాబ్దాల పాటు భావజాల ఆధారిత ఓటింగ్ ధోరణి కొనసాగడం విశేషం. 1977 నుండి 2011 వరకు దాదాపు 34 ఏళ్ల పాటు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ఇండియా (మార్క్సిస్ట్) ని ఎడమపక్ష ఫ్రంట్ నిరంత రాయంగా పాలన సాగించడం ప్రపంచ ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక అరుదైన ఘట్టం. జ్యోతిబసు, బుద్ధదేవ్ భట్టాచార్య వంటి ఉద్ధండుల నేతృత్వంలో సాగిన ఈ సుదీర్ఘ పాలనలో భూ సంస్కరణలు, పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం వంటి విప్లవాత్మక మార్పులు సంభవించినప్పటికీ, అదే పాలన కాలక్రమేణా పారిశ్రామిక స్తబ్దతకు, యువతలో నిరుద్యోగానికి దారితీసింది. ఈ నేపథ్యంలోనే మమతా బెనర్జీ అనే ఒక ధీరవనిత నాయకత్వంలో తృణమూల్ కాంగ్రెస్ ఆవిర్భవించి, బెంగాల్ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసింది.?బెంగాల్ రాజకీయాల్లో 2011 ఒక చారిత్రాత్మక సంవత్సరం. సింగూర్‌లో టాటా మోటార్స్ నానో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జరిగిన భూసేకరణ ఉద్యమం, నందిగ్రామ్‌లో పోలీసు కాల్పుల ఘటనలు ఎడమపక్ష కోటను కూల్చి వేసేందుకు పునాదులు వేశాయి. 'మా, మాటి, మనుష్' (తల్లి, భూమి, ప్రజలు) అనే భావోద్వేగ భరిత నినాదంతో మమతా బెనర్జీ ప్రజల్లోకి వెళ్లారు. సామాన్యుడి గొంతుకగా మారిన ఆమె, పారిశ్రామికీకరణ పేరుతో జరుగుతున్న బలవంతపు భూసేకరణను తీవ్రంగా వ్యతిరేకించి రైతు పక్షపాతిగా ముద్ర వేసుకున్నారు. దీని ఫలితంగా 2011 అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ అనూహ్య విజయం సాధించి, మూడు దశాబ్దాల ఎడమపక్ష పాలనకు చరమగీతం పాడింది. ఆ విజయం కేవలం ఒక పార్టీ ఓటమి కాదు, బెంగాల్‌లో ఒక యుగపు ముగింపు మరియు కొత్త రాజకీయ శకానికి ప్రారంభం. అప్పటి వరకు నామమాత్రంగా ఉన్న తృణమూల్, ఒక్కసారిగా ప్రధాన శక్తిగా ఎదిగింది. అధికారం లోకి వచ్చిన తర్వాత మమతా బెనర్జీ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకునే దిశగా అడుగులు వేశారు. 2016 అసెంబ్లీ ఎన్నికల నాటికి ఆమెపై అనేక విమర్శలు, శారదా చిట్ ఫండ్ వంటి కుంభకోణాల ఆరోపణలు వచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఆమెను కాపాడాయి. ఆ ఎన్నికల్లో తృణమూల్ 294 స్థానాలకు గాను 211 స్థానాలను గెలుచుకుని తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఆ సమయంలో భారతీయ జనతా పార్టీ కేవలం 3 స్థానాలకే పరిమితమైనప్పటికీ, లోలోపల హిందూ ఓట్లను సమీకరించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. బెంగాల్ రాజకీయాల్లో అంతవరకు అంతర్లీనంగా ఉన్న మతపరమైన ధ్రువీకరణ క్రమంగా బహిర్గతం కావడం మొదలైంది. ముఖ్యంగా సరిహద్దు జిల్లాల్లో అక్రమ వలసలు, బుజ్జగింపు రాజకీయాలనే అంశాలను భాజపా తన అస్త్రాలుగా మలుచుకుంది.2019 లోక్‌సభ ఎన్నికలు బెంగాల్ రాజకీయాల్లో మరో మలుపు. జాతీయ స్థాయిలో మోదీ హవా, బెంగాల్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో భాజపా పెంచుకున్న కేడర్ బలం కలిసి ఆ పార్టీని 18 లోక్‌సభ స్థానాల్లో విజయకేతనం ఎగురవేసేలా చేశాయి. ఓటు శాతం పరంగా తృణమూల్ (43%) కు దాదాపు దరిదాపుల్లోకి భాజపా (40%) చేరుకోవడం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేసింది. ఈ ఫలితం 2021 అసెంబ్లీ ఎన్నికలకు రణక్షేత్రాన్ని సిద్ధం చేసింది. 2021 ఎన్నికలు కేవలం బెంగాల్ ఎన్నికలుగా కాకుండా, జాతీయ స్థాయిలో మోదీ-అమిత్ షా ద్వయానికి మరియు మమతా బెనర్జీకి మధ్య జరిగిన అస్తిత్వ పోరాటంగా మారాయి 'ఖేలా హోబే' (ఆట మొదలైంది) అనే నినాదంతో మమత తన కేడర్‌లో ఉత్సాహం నింపగా, భాజపా తన సర్వశక్తులూ ఒడ్డి ప్రచారం చేసింది. ఫలితంగా తృణమూల్ 213 స్థానాలతో తిరిగి అధికారాన్ని కైవసం చేసుకుంది. అయితే, భాజపా తన స్థానాలను 3 నుండి 77 కి పెంచుకుని ప్రధాన ప్రతిపక్షంగా అవతరించడం ఆ పార్టీ ఎదుగుదలకు నిదర్శనం. మరోవైపు, ఒకప్పుడు రాష్ట్రానికి దిక్సూచిగా ఉన్న ఎడమపక్షాలు మరియు కాంగ్రెస్ సున్నా స్థానాలకు పడిపోవడం బెంగాల్ రాజకీయాలు పూర్తిగా ద్విముఖ పోటీగా మారిపోయాయని స్పష్టం చేశాయి.?ప్రస్తుత రాజకీయ స్థితిగతులను విశ్లేషిస్తే, తృణమూల్ కాంగ్రెస్ విజయావకాశాలు ప్రధానంగా మహిళా ఓటర్లపై ఆధారపడి ఉన్నాయి. 'లక్ష్మీ భండార్' (మహిళలకు ఆర్థిక సాయం), 'కన్యాశ్రీ' (బాలికల విద్య), 'సబూజ్ సాథీ' (సైకిళ్ల పంపిణీ) వంటి పథకాలు మమతకు గట్టి ఓటు బ్యాంకును నిర్మించాయి. బెంగాల్ జనాభాలో సుమారు 27 శాతం ఉన్న ముస్లిం ఓటర్లు కూడా అత్యధికంగా తృణమూల్ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే, పార్టీని అవినీతి ఆరోపణలు వెంటాడుతున్నాయి. పార్థా ఛటర్జీ, జ్యోతిప్రియా మల్లిక్ వంటి కీలక నేతలు జైలు పాలు కావడం పార్టీ ప్రతిష్ఠను కొంత దెబ్బతీసింది. అయినప్పటికీ, స్థానిక స్థాయిలో తృణమూల్ కేడర్ బలం, మమతా బెనర్జీ చరిష్మా ఆ పార్టీని పటిష్టంగా ఉంచుతున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా తృణమూల్ తన పట్టును నిలబెట్టుకోవడం దీనికి నిదర్శనం.భారతీయ జనతా పార్టీ విషయానికి వస్తే, ఆ పార్టీ ప్రధానంగా హిందూ ఓట్ల ఏకీకరణపై దృష్టి పెట్టింది. ఉత్తర బెంగాల్ మరియు మతువా వర్గం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో భాజపా కు బలమైన మద్దతు ఉంది. కేంద్ర ప్రభుత్వ పథకాలు, జాతీయవాదం మరియు తృణమూల్ సర్కారుపై ఉన్న వ్యతిరేకతను ఓట్లుగా మలుచుకోవాలని ఆ పార్టీ చూస్తోంది. సందేశ్‌ఖాలీ వంటి ఘటనలను భాజపా రాజకీయంగా బాగా వాడుకుంది. అయితే, రాష్ట్ర స్థాయిలో మమతకు దీటైన నాయకత్వం లేకపోవడం మరియు స్థానిక కేడర్ మధ్య సమన్వయ లోపం ఆ పార్టీకి పెద్ద మైనస్‌గా మారాయి. బెంగాలీ అస్తిత్వం,'బయటి వ్యక్తులు' అనే భావనను తృణమూల్ బలంగా ప్రచారం చేయడంతో, బీజేపీ ఒక హిందీ భాషా పార్టీ అనే ముద్రను చెరిపి వేసుకోవడానికి తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. ఎడమపక్షాలు మరియు కాంగ్రెస్ పునరుద్ధరణ ప్రయత్నాలు ప్రస్తుతం ప్రాముఖ్యత సంతరించు కుంటున్నాయి. ఇటీవలి కాలంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలు 'మినూ సే' (కొత్త తరం) నాయకత్వాన్ని తెరపైకి తెచ్చా యి. మహ్మద్ సలీం వంటి సీనియర్ నేతలు పార్టీని క్షేత్ర స్థాయిలోకితీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, ముస్లిం ఓట్లు తృణమూల్ వైపు, హిందూ ఓట్లు భాజపా వైపు చీలిపోవడంతో ఈ కూటమికి పట్టు దొరకడం కష్టమవుతోంది. ఒకవేళ వీరు కనీసం 15 నుండి 20 శాతం ఓట్లు సాధించగలిగితే, అది తృణమూల్ కంటే భాజపా కే ఎక్కువ నష్టం కలిగించే అవకాశం ఉంది. ఎందుకంటే ప్రభుత్వ వ్యతిరేక ఓటు గతంలో బీజేపీకు వెళ్లగా, ఇప్పుడు అది ఎడమపక్షాల వైపు మళ్లే అవకాశం ఉంది. ?మొత్తంగా చూస్తే, పశ్చిమ బెంగాల్ రాజకీయం ప్రస్తుతం ఒక సంక్లిష్ట దశలో ఉంది. ఇది కేవలం అభివృద్ధి మరియు సంక్షేమం చుట్టూ తిరిగే రాజకీయం కాదు; ఇక్కడ 'బెంగాలీ అస్తిత్వం' వర్సెస్ 'జాతీయవాదం', 'సెక్యులరిజం' వర్సెస్ 'ధ్రువీకరణ' మధ్య నిరంతర యుద్ధం సాగుతోంది. అక్రమ వలసలు, సరిహద్దు భద్రత, పారిశ్రామికీకరణ మరియు నిరుద్యోగం వంటి అంశాలు ప్రధాన ఎజెండాగా ఉన్నప్పటికీ, అంతిమంగా ప్రజలు నాయకత్వ స్థిరత్వానికి మరియు సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో తృణమూల్ కాంగ్రెస్ తన అవినీతి మరకలను ఎలా కడుక్కుంటుందో, భాజపా తన 'బెంగాలీ ముఖ చిత్రాన్ని' ఎలా నిర్మించు కుంటుందో చూడాలి. సిద్ధాంతాల నుండి వ్యక్తిగత విమర్శల వరకు, గ్రామ సభల నుండి సుప్రీంకోర్టు వరకు బెంగాల్ రాజకీయం ఎప్పుడూ ఒక రణరంగమే. ఈ పోరులో అంతిమ విజేత ఎవరన్నది ప్రజల చైతన్యం మరియు మారుతున్న రాజకీయ సమీకరణాలపై ఆధారపడి ఉంటుంది. బెంగాల్ ఇచ్చే తీర్పు ఎప్పుడూ దేశ రాజకీయాలకు ఒక దిక్సూచిగానే నిలుస్తుంది.

ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం: ట్రంప్ ప్రకటన

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. శాంతిని నెలకొల్పడంలో భాగంగా 10 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించేందుకు ఇరు దేశాలు అంగీకరించినట్లు చెప్పారు. ఈ శాంతి చర్చల కోసం ఇజ్రాయెల్, లెబనాన్‌లతో కలిసి పనిచేసే బాధ్యతను అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోలకు అప్పగించానని అన్నారు.అయితే, ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల ప్రతినిధులు 34ఏళ్ల తర్వాత వాషింగ్టన్‌లో తొలిసారి భేటీ అయ్యారని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈ క్రమంలో లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులతో మాట్లాడానని ట్రూత్ సోషల్ వేదికగా వెల్లడించారు. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది యుద్ధాలు ఆపడం తనకు దక్కిన గౌరవమని.. ఇది పదోది కాబోతోందంటూ ట్రంప్ స్వయంగా ప్రకటించుకోవడం గమనార్హం.